క్లుప్తంగా

ఆరోగ్యమిత్రకు సేవా పురస్కారం



శ్రీలక్ష్మికి పురస్కారం అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా పథకాల అమలులో లబ్ధిదారులకు అందించిన సేవలకు రాష్ట్ర ప్రభుత్వం సేవా ఆరోగ్యమిత్ర పురస్కారాన్ని జూలై నెలకు డి.శ్రీలక్ష్మి (లక్ష్మీ హాస్పిటల్, కాకినాడ)కి అందించింది. దీనిని సోమవారం కలెక్టర్ కృతికా శుక్లా చేతుల మీదుగా ప్రదానం చేశారు. ప్రశంసాపత్రం, రూ.5 వేల నగదు పురస్కారాన్ని శ్రీలక్ష్మికి అందజేశారు. ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ పి.రాధాకృష్ణ, జిల్లా మేనేజర్ కె.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రనాథ్ ఠాగూర్‌కు ఘన నివాళి



సర్పవరం జంక్షన్‌లో రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వాకర్స్ సభ్యులు

కాకినాడ రూరల్: విశ్వకవి, జాతీయ గీతం జనగణమన రచయిత రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి బోట్‌క్లబ్ వాకర్స్ సంఘ సభ్యులు ఘన నివాళులర్పించారు. సోమవారం సర్పవరం జంక్షన్‌లో ఠాగూర్ వర్ధంతిని నిర్వహించారు. విశ్రాంత గ్రంథాలయ అధికారి చింతపల్లి సుబ్బారావు, అడబాల రత్నప్రసాద్, చంద్రరావు తదితరులు పాల్గొని మాట్లాడారు. ఠాగూర్ గొప్ప దేశభక్తుడని అన్నారు. 1913లో గీతాంజలి పద్య కావ్యానికి నోబుల్ పురస్కారం పొందారన్నారు.

ఉద్యోగాలకు యువత ఎంపిక

కాకినాడ సిటీ: ఉద్యోగాలు ఇప్పించాలంటూ కలెక్టరేట్ స్పందనలో దరఖాస్తులు చేసుకున్న ఎనిమిది మందికి వికాస ద్వారా వివిధ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించారు. వీరంతా సోమవారం స్పందన హాలులో కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. గోపాల్ ఆటోమోటివ్ కంపెనీలో అకౌంటెంట్‌గా ఎస్.పృథ్వీరాజ్, శ్రీసత్య మారుతి హాస్పిటల్‌లో పీఆర్వోలుగా జి.వెంకటేష్, ఎ.శివగోపరాజు, కె.శ్రీనివాస్ ఎంపికయ్యారు. అల్ట్రా ఇంటర్నేషనల్ ఐ హాస్పిటల్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌లుగా కె.గంగాధర్, ఎం.అవినాష్, జి.హేమంత్, యు.సచిన్ ఎంపికయ్యారని వికాస పీడీ కె.లచ్చారావు వివరించారు. జేసీ ఇలక్కియ, డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి, వికాస ప్రాజెక్టు డైరెక్టర్ లచ్చారావు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ కమిషనర్ బదిలీ

కాకినాడ: స్థానిక నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాలను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 10న మహేష్‌కుమార్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయనను పురపరిపాలన శాఖ విధుల నుంచి తప్పిస్తూ సాధారణ పరిపాలన విభాగానికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. కాకినాడ నగర పాలక సంస్థ నూతన కమిషనర్‌గా ఎవరినీ నియమించలేదు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు నూతన కమిషనర్ వచ్చే వరకూ కమిషనర్‌గా విధులు నిర్వర్తించనున్నారు.

వీఆర్‌ఏల దీక్ష

కాకినాడ సిటీ: వీఆర్‌ఏలను పర్మినెంట్ చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలు చేపట్టారు. తమకు పని ఒత్తిడి తగ్గించాలని తదితర డిమాండ్లు చేశారు. సీఐటీయూ నాయకులు దువ్వా శేషుబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్‌లు దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. వీఆర్‌ఏల సంఘ నాయకులు సురేష్ ఇజ్రాయిల్, గెద్దం చినబాబూజీ, వినకోటి సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్మికుల ధర్నా

కాకినాడ సిటీ: మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించి, టైం స్కేల్ వర్తింప చేయాలంటూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు నెలకు రూ.18,500 వేతనం ఇవ్వాలని కోరారు. సీఐటీయూ నగర కమిటీ నాయకులు మలకా రమణ, మేడిశెట్టి వెంకటరమణ, లీలపు ఏసమ్మ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల పర్యటన

కరప: వేములవాడ, యండమూరు గ్రామాల్లో పొలాలను సోమవారం టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్‌బాబా తదితరులు పరిశీలించారు. సాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని అధికారులను కోరారు.

జనసేన ప్రచారం

కరప: సిరిపురంలో జనసేన పీఏసీ సభ్యుడు, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పంతం నానాజీ ఆధ్వర్యంలో జనంకోసం పవన్–పవన్ కోసం జనం కార్యక్రమాన్ని నిర్వహించారు.

బాగు చేస్తే ఆహ్లాదమే..

- అధ్వానంగా విద్యుత్‌నగర్ పార్కు
- తుప్పుపట్టిన ఆట పరికరాలు

బోట్‌క్లబ్: కాకినాడ స్మార్ట్ సిటీ అన్ని విధాలా అభివృద్ధి చెందుతోంది.. రోడ్లు, పార్కులు ఇలా ఒకటేమిటి అన్నీ ప్రగతి బాట పడుతున్నారు. అయితే స్థానిక 49వ డివిజన్ విద్యుత్‌నగర్ ఐడియల్ కళాశాల రోడ్డులో వాటర్ ట్యాంకు పక్కనే ఉన్న పార్కు ప్రజలకు ఉపయోగపడడం లేదు. ఇది నిర్వహణ లేక ఎందుకూ కొనగాకుండా తయారైంది. విద్యుత్‌నగర్ ప్రాంతంలో అధిక శాతం మధ్య తరగతికి చెందిన ప్రజలు నివసిస్తున్నారు. ఇక్కడ 8 వేల కుటుంబాలు ఉన్నాయి. వీరి కోసం అనేక ఏళ్ల కిందట అర ఎకరం విస్తీర్ణంలో పార్కు ఏర్పాటు చేశారు. ఈ పార్కులో కనీస సదుపాయాలు లేక ఇక్కడి ప్రజలు 1.5 కిలోమీటర్ల దూరంలోని బోట్‌క్లబ్ పార్క్‌కు వెళ్లాల్సి వస్తోంది. ప్రస్తుతం విద్యుత్‌నగర్ పార్కులో పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగాయి. కనీసం వాకింగ్ ట్రాక్ సక్రమంగా లేక వృద్ధులు, వాకర్స్ ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్ సదుపాయం లేక రాత్రయితే చీకటి అలముకుంటోంది. దీంతో మందుబాబులకు అడ్డాగా మారింది. పార్కులో చిన్నపిల్లలు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన ఆట పరికరాలు తుప్పుపట్టి పాడవుతున్నాయి. పిచ్చి మొక్కలు పెరగడంతో విష సర్పాల భయం వెంటాడుతోంది. గతంలో వాకింగ్ ట్రాక్ బాగుండడంతో సమీపంలోని వృద్ధులు ఉదయం, సాయంత్రం ఇక్కడ వాకింగ్ చేసేవారు. జారుడు బల్ల, ఊయల వంటి పరికరాలు ఉండడంతో కుటుంబ సభ్యులతో సహా ఇక్కడకు వచ్చి సాయంత్రం సేద తీరేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.



పార్కులో పెరిగిపోయిన పిచ్చి మొక్కలు

తాగుతూ.. ఊగుతూ..

చీకటి పడితే పార్కులో ఉన్న బెంచీలపై కొందరు మందుబాబులు తిష్ట వేస్తున్నారు. లైట్లు లేకపోవడంతో వారు అర్ధరాత్రి వరకూ ఇక్కడే తాగి తందనాలు ఆడుతున్నారు. వారు తాగి పాడేసిన మద్యం సీసాలతో పార్కు అధ్వానంగా తయారైంది. ఎక్కడ చూసినా మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. సమీప ఇళ్లలోని ప్రజలు ఎవరైనా ఇదేమిటని ప్రశ్నిస్తే వారిపై తిరగబడుతున్నారు. మందుబాబులతో గొడవ ఎందుకని సర్దుకుపోవాల్సిన పరిస్థితి నెలకొందని అక్కడి వారు అంటున్నారు. పోలీసులు, అధికారులు స్పందించి ఇక్కడి పరిస్థితిని చక్కదిద్దాలని కోరుతున్నారు.



తుప్పుపట్టిన క్రీడా పరికరాలు

వినియోగంలోకి తేవాలి



పార్కులో పిచ్చి మొక్కలు తొలగించి, వాకింగ్ ట్రాక్‌కు మరమ్మతులు చేస్తే కనీసం రోజూ వాకింగ్ చేసేందుకు వీలుంటుంది. ప్రస్తుతం ఇక్కడ సౌకర్యాలు లేక బోట్‌క్లబ్ పార్కుకు వాకింగ్‌కు వెళుతున్నాను. అధికారులు స్పందించి పార్క్‌ను అందుబాటులోకి తీసుకురావాలి.

–సుబ్బారావు, విద్యుత్‌నగర్

ఆత్మీయ స్వాగతం



రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో హెలిపాడ్ వద్ద సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

చేనేతల సంక్షేమానికి కృషి

కరప: కూరాడ, వేళంగి, అరట్లకట్ట, గొర్రిపూడి గ్రామ పంచాయతీల కార్యాలయాల్లో సోమవారం చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కూరాడలో సర్పంచ్ వాసంశెట్టి కొండ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ రావుల ప్రసాద్ మాట్లాడారు. చేనేత రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ ఖద్దరు వస్త్రాలు ధరించాలన్నారు. నేతన్నల జీవితాలలో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేక్ కట్ చేసి అందరికీ పంచారు. కార్యదర్శి కె.రవి, ఉప సర్పంచ్ రావుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యకూ పరిష్కారం

కాకినాడ: స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు అధ్యక్షతన నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. పన్నులలో వ్యత్యాసాలు, పారిశుధ్యం, టౌన్ ప్లానింగ్, ప్రభుత్వ పథకాలకు సంబంధించి 15 మంది వినతులు అందజేశారు. ఆయా విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఏడీసీ నాగనరసింహారావు అధికారులను ఆదేశించారు. ప్రతి అర్జీకి నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఏసీ సత్యకుమారి, ఈఈ వెంకట్రావు, డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. తొలుత జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా డయల్ యువర్ కమిషనర్ నిర్వహించారు. ఏడీసీ నాగనరసింహారావు ఫోన్ ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి 8 వినతులు అందుకున్నారు. వీటి పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చారు.



స్పందనలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏడీసీ నాగనరసింహారావు

ఉన్నత శిఖరాలు అధిరోహించండి



నన్నయలో ఫేర్‌వెల్ పార్టీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కమలకుమారి

కాకినాడ రూరల్: అచ్చంపేట జంక్షన్ వద్ద ఉన్న నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో డిపార్టుమెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విద్యార్థులకు వారి జూనియర్స్ ఎంబీఏ, ఎం.కామ్ మొదటి సంవత్సర విద్యార్థులు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. బోన్ వయోగ్ భాష్ పేరిట నిర్వహించిన ఫేర్‌వెల్ పార్టీలో ప్రిన్సిపాల్ డాక్టర్ కమలకుమారి ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉన్నత విద్యను పూర్తి చేసుకుని వెళుతున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. జూనియర్లు తమ సీనియర్ల మంచి సూచనలు, సలహాలు పొందాలన్నారు. అనంతరం విద్యార్థుల ఆటపాటలు అలరించాయి. డీసీఎంఎస్ హెచ్‌ఓడీ డాక్టర్ అజయ్ రతన్, అధ్యాపకులు రామరాజు, అనిల్ అంబిక, మధుకుమార్, మణికంఠేశ్వరరెడ్డి, మనోజ్ దేవ, అప్పారావు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకర్ భరత్‌కు సత్కారం



క్రికెటర్ శ్రీకర్ భరత్‌ను సత్కరిస్తున్న కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి, బన్నీ

కాకినాడ రూరల్: అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారుడు కోన శ్రీకర్ భరత్‌ను కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కౌడా) చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ కార్పొరేటర్ బన్నీ ఘనంగా సత్కరించారు. పెనుమర్తిలో శ్రీకిరణ్ కంటి ఆస్పత్రిలో సోమవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీకర్ భరత్‌ను శాలువాతో సత్కరించి మెమెంటో ప్రదానం చేశారు. పద్మశ్రీ డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువల్లో గుర్రపుడెక్క తొలగింపు

కరప: స్థానిక గరువుకాలువ, న్యూ భీమన్న కర్ర కాలువ, వెల్ల నార్త్ కెనాల్ ద్వారా విజయరాయుడు పాలెం, పెద్దాపురప్పాడు, యండమూరు గ్రామాలకు సాగునీరు అందుతుంది. ఈ కాలువల ద్వారా నీరందడం లేదని మండల రైతులు ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి ఇరిగేషన్ అధికారులతో ఆదివారం సమావేశమయ్యారు. ఒక ఎకరా కూడా ఎండిపోకుండా సాగునీరందించాలని, పంట కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూటుకాడ, గడ్డి మొక్కలను తొలగించాలని ఆదేశించారు. దీంతో ఇరిగేషన్ అధికారులు సోమవారం పంట కాలువలలో పొక్లెయిన్‌తో గుర్రపుడెక్కను తొలగించే పని చేపట్టారు. పెనుగుదురు సొసైటీ మాజీ అధ్యక్షుడు చీకాల అప్పలరాజుతో కలసి సోమవారం కొవ్వూరు సెక్షన్ డీఈఈ ఆకెళ్ల రవికుమార్ పెనుగుదురు వద్ద కేఎంజే కెనాల్‌లో గుర్రపుడెక్క తొలగించే పనిని పరిశీలించారు.



పెనుగుదురు కేఎంజే కాలువలో గుర్రపుడెక్క తొలగింపును పరిశీలిస్తున్న డీఈఈ రవికుమార్

ప్రజలు మెచ్చేలా ప్రభుత్వ వైద్య సేవలు

కరప ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి

కరప: ప్రభుత్వ వైద్య సేవలను ప్రజలు మెచ్చేలా అందించేందుకు కృషి చేయాలని వేళంగి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అన్నారు. వేళంగిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యశాఖ ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్, 104 సంచార వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు పలు సూచనలు అందించారు. డాక్టర్ ఎంకే సౌజన్య పీహెచ్‌సీ ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. పీహెచ్‌సీ పరిధిలో నాలుగు షాపులు ఉన్నాయని, వాటిని గతంలోని అభివృద్ధి కమిటీ వ్యాపారులకు అద్దెకిచ్చినా ఆదాయం రావడం లేదని, కొత్త కమిటీ వాటిని స్వాధీనం చేసుకుని, పీహెచ్‌సీకి ఆదాయం వచ్చేలా చేయాలన్నారు. పీహెచ్‌సీలో స్వీపర్, నైట్‌వాచ్ మెన్‌లకు తక్కువ వేతనం ఇవ్వడంతో కొద్దిగంటలే పనిచేస్తున్నారని, ఆపరేషన్ థియేటర్‌లో సదుపాయాలు లేక డెలివరీ కేసులుంటే కరపపీ హెచ్‌సీకి పంపించాల్సి వస్తోందని సౌజన్య తెలిపారు. ఈ సమస్యలను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీపీ శ్రీలక్ష్మి హామీ ఇచ్చారు. తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, వేములవాడ సర్పంచ్ కమిడి మంగాదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, సవిలే రాజేష్, కె.శంకర్ తదితరులు పాల్గొన్నారు.



వేళంగి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సౌజన్య

కళా సేవలకు పురస్కారం



నిర్వాహకుల నుంచి అవార్డు స్వీకరిస్తున్న కళాకారుడు తురగా సూర్యారావు

కాకినాడ కల్చరల్: కాకినాడకు చెందిన రంగస్థల నటుడు తురగా సూర్యారావుకు నేషనల్ ఇంటిగ్రేషన్ అవార్డు ప్రదానం చేశారు. సృజనా ఆర్ట్ క్రియేషన్స్ సంస్థ హైదరాబాద్ బొగ్గులకుంటలోని సరస్వతీ పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నేషనల్ ఇంటిగ్రేషన్ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించింది. కళారంగంలో తురగా చేస్తున్న సేవలకు గుర్తింపుగా అవార్డు ప్రదానం చేశామని క్రియేషన్స్ కార్యదర్శి ఎం.రాజేష్ అన్నారు. ఈ అవార్డు కళా రంగంపై మరింత బాధ్యత పెంచిందని తురగా అన్నారు.

స్వాతంత్య్ర దినోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు

కాకినాడ సిటీ: భారత స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 15న జిల్లా స్థాయిలో వేడుకలు నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాటు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీధర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వివేకానంద హాల్‌లో రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, విద్య, వైద్య ఆరోగ్యం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, స్త్రీశిశు సంక్షేమం తదితర శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీస్ పెరేడ్ మైదానంలో స్వాతంత్య్ర దిన వేడుకల నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించి పలు సూచనలిచ్చారు. పోలీస్, ఎన్‌సీసీ దళాలతో సంప్రదాయ కవాతుకు ఏర్పాటు చేయాలని ఆ శాఖ అధికారులను కోరారు. వచ్చే అతిథులు, ప్రజలు, అధికారులు తదితరులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆర్డీవో ఎస్‌వీవీ సత్యనారాయణ, అర్బన్ తహసీల్దార్ సీతాపతిరావులను ఆదేశించారు. పాఠశాలల విద్యార్థులతో దేశభక్తితో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని డీఈవోకు సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖలు తమ పరిధిలోని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సందేశాలతో అలంకరించిన శకటాలను వేడుకలలో ప్రదర్శించాలన్నారు. ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. పారిశుధ్యం, తాగునీరు తదితరాలకు ఇబ్బంది లేకుండా చూడాలని కాకినాడ నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డి, డీపీఆర్‌వో డి.నాగార్జున, డీఎంహెచ్‌వో డాక్టర్ ఆర్.రమేష్, డీపీవో ఆర్.విక్టర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎస్.సూర్యప్రకాశరావు, విద్యా శాఖ ఆర్జేడీ జి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఇదిలాఉంటే స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ జిల్లా కవాతు మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆర్డీవో ఎస్‌వీవీ సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమాలకు హాజరయ్యే అతిథులకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేయాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అర్బన్ తహసీల్దార్ పి.సీతారావు, ఆర్ఐ దీపక్ ఉన్నారు.



స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో సత్యనారాయణ

కార్మిక సంఘాల ర్యాలీ

కాకినాడ సిటీ: మోదీని గద్దె దింపండి, దేశాన్ని కాపాడండి అనే నినాదంతో కేంద్ర కార్మిక సంఘాలు ఈ నెల 9న దేశవ్యాప్తంగా కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు నిర్వహించనున్నాయి. ఇందులో భాగంగా కాకినాడలో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం భానుగుడి నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇది జిల్లా పరిషత్ సెంటర్ మీదుగా కలెక్టరేట్ సమీపంలో అంబేడ్కర్ విగ్రహం వరకూ సాగింది. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో 13 లక్షల ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాల నాయకులు దువ్వా శేషుబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్, మలకా రమణ, మేడిశెట్టి వెంకటరమణ, తాళ్లూరి రాజు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్షాల నాయకులు

వార్డు సభ్యుల ఎన్నికకు నేటి నుంచి నామినేషన్లు

కరప: నడకుదురులో ఏడో వార్డు, గొడ్డటిపాలెంలో ఆరో వార్డు సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేశామని, మంగళవారం నుంచి నామినేషన్లు స్వీకరిస్తామని ఎంపీడీఓ కె.అప్పారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీ వరకూ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఆయా పంచాయతీ కార్యాలయాల్లో నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. 11న నామినేషన్ల స్క్రూటినీ, 12న అభ్యంతరాల స్వీకరణ, 14న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. 19న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పోలింగ్ జరుగుతుంది. అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్లు లెక్కించి, విజేతలను ప్రకటిస్తారు.

గద్దర్‌కు ఘన నివాళి

కాకినాడ సిటీ: విప్లవ గాయకుడు గద్దర్ మృతికి ఏపీ ఆర్‌సీఎస్, ఏఐఎఫ్‌టీయూ సంఘాల ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఆయా ప్రజా సంఘాల నాయకులు గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గద్దర్ అమర్ రహే, సాధిస్తాం మీ ఆశయాలను అంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు వల్లూరి రాజబాబు, బి.రమేష్, కడితి సతీష్, మణిక సత్యం, కుంద అంజిబాబు, రాయుడు గోవిందు, మక్తుమ్ పాల్గొన్నారు.



గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

బాధితుడికి చేయూత

బోట్‌క్లబ్: ఆపన్నులను ఆదుకోవడంలోనే నిజమైన ఆనందం ఉంటుందని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ అన్నారు. రంపచోడవరానికి చెందిన చక్రపాణి చెట్టుపై నుంచి పడిపోవడంతో వెన్నెముకకు శస్త్రచికిత్స చేయడంతో కదలలేని పరిస్థితుల్లో ఉన్నాడు. అతని పరిస్థితి డాక్టర్ మధు ద్వారా తెలుసుకున్న అడ్డాల సోమవారం అతని నివాసానికి వెళ్లి ధైర్యం చెప్పి వీల్‌చైర్ అందించారు.



చక్రపాణి కుటుంబ సభ్యులకు వీల్‌చైర్ అందిస్తున్న డాక్టర్ అడ్డాల సత్యనారాయణ

ఎక్సలెన్సీ అవార్డుకు పాఠశాలల ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వుల మేరకు ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవం, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఈవో నాగమణి సోమవారం తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అత్యంత క్రీడా ప్రతిభను కనపరిచిన 5 పాఠశాలలకు 2022–23 సంవత్సరానికి స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డులను అందజేస్తామన్నారు. దీనికి గాను స్కూల్‌గేమ్స్‌లో ఏ కేటగిరిలో ఉన్న 35, బీ కేటగిరిలో ఉన్న 51 గేమ్స్‌లో పాల్గొన్న క్రీడాకారుల సర్టిఫికెట్లు సంబంధిత హెచ్‌ఎంలు ధ్రువీకరించిన జిరాక్స్‌లతో ఈ నెల 16వ తేదీ లోపు స్కూల్ గేమ్స్ ప్రధాన కార్యాలయంలో సమర్పించాలని ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్ సోమవారం తెలిపారు.

అధికమాస పవమాన హోమాలు

బోట్‌క్లబ్: అధిక మాసం సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో సుధా పండితులు ఆధ్వర్యంలో పవమాన హోమాలు నిర్వహిస్తామని ఉత్తరాధి మఠ కేంద్ర కమిటీ ప్రత్యేక ప్రతినిధి పండిత కానుగోవి వాసుదేవాచార్ అన్నారు. స్థానిక మధ్వసభలో కమిటీ అధ్యక్షులు రాచూరి రాఘవేంద్రస్వామితో కలసి ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడారు. ఉత్తరాధి మఠాధీశులు సత్యాత్మతీర్థ స్వామీజీ అనుగ్రహంతో అన్ని ప్రాంతాల్లో విశేష హోమాదికాలు నిర్వహిస్తున్నామన్నారు. కాకినాడ, విజయనగరం, రాజమహేంద్రవరం, విశాఖపట్నం, శ్రీకాకుళం, గుంటూరులో ఈ కార్యక్రమాలు సుధాపండితుల భాగస్వామ్యంతో మధ్వగృహస్తుల సహకారంతో జరుగుతున్నాయని అన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

సామర్లకోట: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జేసీ ఇలక్కియ సూచించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇలక్కియ మాట్లాడుతూ స్థానిక జగనన్న లేఅవుట్‌లో అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించారని, అక్కడ నిర్మాణాలు జరిగేలా చూడాలన్నారు. లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు ఇప్పించి ఇళ్ల నిర్మాణాలకు సహకరించాలన్నారు. ఇంటి అద్దెకు చెల్లించే మొత్తం బ్యాంకు వాయిదాలకు చెల్లించడం ద్వారా ప్రతి ఒక్కరి సొంతింటి కల సాకారం అవుతుందని అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఇస్తుందని, లబ్ధిదారులు మరో రూ.35 వేలు చెల్లిస్తే థర్డ్ ఆప్షన్‌లో ప్రభుత్వం ఇళ్లు కట్టించి ఇస్తుందని చెప్పారు. దీనికి కూడా లబ్ధిదారులు ముందుకు రాకపోతే వారికి ఇంటి అవసరం లేనట్లు గుర్తించాలన్నారు. ఇప్పటి వరకూ నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారుల పేరు పేరునా వివరాలు తెలుసుకున్నారు. సాకులు చెప్పకుండా పనులు జరిగేలా చూడాలన్నారు. ఈ నెల 20వ తేదీ నాటికి జగనన్న కాలనీలో అన్ని మౌలిక సదుపాయాలు పూర్తి చేయాలన్నారు.

క్రికెట్ ఆడి.. ఉత్సాహపరిచి..



మున్సిపల్ కార్పొరేషన్ స్కూల్‌లో విద్యార్థులతో క్రికెట్ ఆడుతున్న భరత్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారుడు కోన శ్రీకర్ భరత్ సోమవారం కాకినాడలో గల్లీ క్రికెట్ ఆడి విద్యార్థులను ఉత్సాహపరిచారు. అక్షయపాత్రకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న ఆయన వాకలపూడిలోని అక్షయపాత్ర వంటశాలను పరిశీలించడానికి విచ్చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు గాంధీనగర్‌లోని నగరపాలక సంస్థ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులతో కొంత సమయం క్రికెట్ ఆడారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వితరణ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రవి, పాఠశాల హెచ్‌ఎం ఎస్‌వీఎల్ రాజు ఉన్నారు.